హైదరాబాద్ వార్త



## రైల్వే ప్రయాణికులకు పరిశుభ్రమైన టాప్‌క్లాస్ అనుభూతి

**దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్**




కార్యాక్రమంలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

కంటోన్మెంట్, అక్టోబర్ 2 ప్రభాతవార్త: రైల్వే ప్రయాణికులకు పరిశుభ్రమైన టాప్‌క్లాస్ రైలు అనుభవాన్ని కల్పించేందుకు రైల్వేశాఖ కృషి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అన్నారు. భారత ప్రధాని మోడీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యాక్రమంలో భాగంగా రైల్వే మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వందే భారత్ రైలులో 14 నిమిషాల అత్భుతం కార్యాక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం నూతన కార్యాక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. అందులో భాగంగానే రైల్వే మంత్రిత్వశాఖ నేతృత్వంలో 14 నిమిషాల అత్భుతం కార్యాక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వందే భారత్ రైలులో 16కోచ్‌లు ఉండగా ఒక్క బ్యచ్‌లో ముగ్గురు కీనర్‌ల చొప్పున 16 బ్యాచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరిని స్వచ్ఛ వందే వీర్స్ అని నామకరణం చేసినట్లు చెప్పారు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వందే భారత్ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తరువాత ప్రయాణికులు దిగిన వెంటనే స్వచ్ఛ వందే వీర్స్ 16 బ్యాచ్‌లు ఒక్కో కోచ్‌లోకి వెళ్ళి పరిశుభ్రత పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

# కోరలు చాస్తున్న డెంగీ

**నగరాన్ని వణికిస్తున్న విష జ్వరాలు.. పెరుగుతున్న బాధితులు**

**ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కిక్కిరిసిన రోగులు**

**గాంధీ, నిలోఫర్, ఫీవర్లకు పెరుగుతున్న తాకిడి**

పగటి దోమకాటు ప్రాణాంతకమే.. పగటిపూట కుట్టే దోమ ప్రాణాంతకంగా పరిణమించింది. డెంగీ వ్యాప్తికి కారణమైన ఏడిస్ ఈజిప్టి దోమలతో జ్వర బాధితులు పెరుగుతున్నారు. డెంగీ కారక దోమల బెడద నుంచి జాగ్రత్తగా ఉండడం శ్రేయస్కరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దోమల ఉత్పత్తికి కారణమయ్యే నిల్వ నీరు లేకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.



హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త: డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.గ్రేటర్‌లో కొంత కాలంగా డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతోంది. దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటు న్నాం.. ప్రతి ఆదివారం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కునేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరస్థితులు ఆందోళన కరంగా మారుతున్నాయి.జ్వరాలతో రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. నిలోఫర్, గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతోంది. చిన్నారులపై డెంగీ పంజా విసురుతోంది. నిలోఫర్ ఆస్పత్రిలో పిల్లల వార్డులో 23 మంది చికిత్స పొందుతు న్నారు. గాంధీలో 28మంది చికిత్స పొందుతుం డగా, ఫీవర్ ఆస్పత్రిలో 32 మంది చికిత్స తీసుకుంటున్నారు. యువత, పెద్దలే కాదు పిల్లలు కూడా డెంగీతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో 30 మంది వరకు చేరారు. వీరిలో ముగ్గురికి కాలేయం కిడ్నీలపై ప్రభావం చూపడంతో ఐసీయూల్లో చేరి చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నగరంలో సుమారు 1500 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వానలు కురిసి తగ్గిన తర్వాత సీజన్‌లో సాధారణంగా డెంగీ వ్యాపిస్తుంది. కానీ ఈ వ్యాధి ప్రస్తుతం నగరవ్యాప్తంగా ప్రబలుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడువేల డెంగీ కేసులు నమోదైతే అందులో సగానికి పైగా నగరంలో నమోదవడం వ్యాధి తీవ్రతకు నిదర్శనం. గత ఆగస్టు నుంచి నెలకు 10 రెట్ల చొప్పున కేసులు పెరుగుతున్నాయని ఆసుపత్రులు గణాంకాలు చెబుతున్నాయి. డెంగీ జ్వరం వస్తే శరీరంలోని తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గి ప్రాణాంతకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో దోమల నివారణకు నగర ప్రజలు ప్రాధాన్యమివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ఏడిస్ ఈజిప్టి దోమ కాటేసే వేళలివే..** డెంగీకి దోహదం చేసే ఏడిస్ ఈజిప్టి అనే దోమనే ఎల్లో ఫీవర్ మస్కిటో అనే పేరుతోనూ పిలుస్తారు. ఈ దోమలు ప్రధానంగా ఉదయం 7 నుంచి 9గంటల మధ్య, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఎక్కువగా కుడతాయి. కాబట్టి ఈ సమయంలో దోమలు కుట్టకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలి.ఏడిస్ ఈజిప్టి దోమను గుర్తించడానికి సులభమైన మార్గం వాటి నలుపు రంగు. కాళ్లపై తెల్లటి మచ్చలుంటాయి.ఈ దోమలు చీలమండలు, మోచేతుల దగ్గర ఎక్కువగా కుడతాయని గ్రహించాలి. వీలుంటే ఆయా శరీర భాగాల్లో మనకు మార్కెట్లో లభించే దోమల నివారణ లేపనం పూయాలి.

### డెంగీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు

**ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్**



జ్వరం మూడు రోజులైనా తగ్గకపోతే వెంటనే డెంగీ టెస్టు చేయించుకోవాలి. డెంగీలో తీవ్ర జ్వరం తోపాటు ఒళ్లు నొప్పులు, పొట్టలో నొప్పి, వాంతులు కళ్ల వెనుక భాగంలో నొప్పి, నీరసం తదితర లక్షణాలు ఉంటాయి. ఐబీపి పరీక్షల్లో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నట్లు తేలినా..డెంగీగానే అనుమానించాలి. పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కానీ ఆందోళన అవసరం లేదు. వైద్యుల సలహా లేకుండా పెయిన్ కిల్లర్స్ ట్యాబ్లెట్లు వాడకూడదు. ఇవి ప్లేట్‌లెట్లను మరింత తగ్గించేస్తాయి. డెంగీ నిర్ధారణ అయిన వారికి కొబ్బరి నీళ్ళ, ఓఆర్ఎస్, పండ్లరసాలు ఇతర ద్రవపదార్థాలు తాగిస్తూ ఉండాలి. తీవ్ర తలనొప్పి, చలితో కూడిన జ్వరం, వాంతులు, వంటిపై రాషెస్ రావడం బీపీ తగ్గిపోవడం లాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలి. దోమలు పెరగకుండా ఇంట్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

## మాల్‌తో ట్రాఫిక్ సమస్య.. అవస్థలు పడుతున్న వాహన చోదకులు



నూతన షాపింగ్ మాల్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 2, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీలో ఇటీవల కొత్తగా ప్రారంభించిన ఓ ఇంటర్నేషనల్ హైపర్ మాల్ కారణంగా స్థానికంగా తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. గత నాలుగు రోజుల క్రితం జెఎన్‌టియూ నుండి హైటెక్‌సిటీ వెళ్ళే మార్గం మధ్యలో ప్రారంభించిన ఈ హైపర్ మాల్ కారణంగా ప్రతిరోజు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. మాల్ ప్రాంగణంలో సరైన రీతిలో పార్కింగ్ సౌకర్యలేని కారణంగా వినియోగదారులు రోడ్లపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపి గంటల తరబడి షాపింగ్ చేసుకని తిరిగి రావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. కొత్తగా ఏర్పడ్డ ఇక్కడి మాల్‌ని చూసేందుకు వినియోగదారులు తండోపతండాలుగా రావడంతో ప్రధానంగా కూకట్‌పల్లి వై జంక్షన్ నుండి మొదలుకొని కెపిహెచ్‌బి కాలనీ, జెఎన్‌టీయూ, మలేషియా టౌన్‌షిప్ కొరకు వాహనాలు బారులు తీరి గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వీకెండ్ హాలిడేస్ రావడంతో గత రెండు రోజులుగా సమస్య మరింత జటిలంగా మారింది. షాపింగ్ మాల్‌కు వచ్చే వినియోగదారులు రోడ్డు పొడవున వాహనాలు అపడంతో పాటు ముందు భాగంలో ఉన్న ఫ్లైఓవర్‌పైన ఒక వరుస క్రమంలో వాహనాలను ఆపడం వల్ల కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. జెఎన్‌టియూ నుండి హైటెక్‌సిటీకి వెళ్ళేందుకు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతూ వస్తున్నామని, ఇక్కడ మాల్ పుణ్యమా అని దాదాపు నాలుగు గంటల ట్రాఫిక్ జామ్ అవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య జటిలంగా మారిన నేపథ్యంలో ట్రాఫిక్ సిబ్బంది సైతం వాహనాలను దారి మళ్ళించే విషయంలో సతమతమవుతున్నారు. వీకెండ్ సమయంలో ఇక్కడి మాల్‌ను సందర్శించవద్దని దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని ట్రాఫిక్ పోలీసులు ముందుగానే హెచ్చరిస్తున్నారు. మాల్‌కు వచ్చే వినియోగదారులకు సరిపడా పార్కింగ్ సౌకర్యం లేకుండా వాహన చోదకులను ఇబ్బందులకు గురిచేస్తున్న హైపర్ మాల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఇష్టంలేని పెళ్లికి ఒప్పించారని.. యువతి ఆత్మహత్య



యువ నాగదుర్గ

కుత్బుల్లాపూర్, అక్టోబరు 2 ప్రభాతవార్త : తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి ఇష్టంలేని ఓ యువతి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోలాశంకర్ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్‌లో నివాసముంటున్న కరింశెట్టిజెన్ని, సత్యవతిలు తమ కుమారుడు, కుమార్తె యువ నాగదుర్గ(23)తో కలిసి ఉంటూ స్థానికంగా ప్రవేటుగా ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నారు. కుమార్తె యువనాగదుర్గకు గత ఫిబ్రబరిలో వివాహం కుదిరి ఎంగేజ్‌మెంట్ అయ్యింది. తనకు పెళ్లి ఇష్టంలేకపోవడంతో తీవ్రమనోవేదనకు గురై తల్లిదండ్రులకు తెలిపింది. తల్లిదండ్రులనుండి స్పందన రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. శనివారం తల్లిదండ్రులు బంధువుల ఇంటికని వెళ్లిపోవడంతో తన సోదరుడిని హోటల్‌కు వెళ్లి భోజనం తీసుకురావాలని చెప్పిపంపి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. హోటల్‌కు వెళ్లినతమ్ముడు ఇంటికివచ్చి ఎంతసేపు తలుపుతట్టినా తీయకపోవడంతో చుట్టుపక్కవారి సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే యువసాగదుర్గ చనిపోయి వుంది.దీనితో తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి వివరాలు వెల్లడించారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.

### దాండియా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

బేగంపేట అక్టోబరు 2,ప్రభాతవార్త : హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా పెద్ద ఎత్తున దాండియా ఉత్సవాల నిర్వహణకు దాండియా రాస్ ఉత్సవ్ సన్నద్ధం అయింది.సెలబ్రిటీ హుడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో దాండియా రాస్ ఉత్సవ్ పేరుతో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని దాండియా రాస్ నిర్వహకులు రషీద్ తెలిపారు.

## చెస్‌తో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధస్సు పెరుగుతుంది

**అర్జున అవార్డు గ్రహీత, కామన్‌వెల్త్ గేమ్స్ విజేత అభిజిత్ గుప్త**




విద్యార్థులో చెస్ ఆడుతున్న అభిజిత్ గుప్త

హైదరాబాద్, అక్టోబరు 2,ప్రభాతవార్త: చెస్‌క్రీడతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధస్సు పెరుగుతుందని అర్జున అవార్డు గ్రహీత కామన్‌వెల్త్ గేమ్స్, స్వర్ణ విజేత గ్రాండ్ మాస్టర్ అభిజిత్ గుప్త అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్రా చెస్ అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కోచింగ్ క్యాంప్‌ను యంగ్ చెస్‌ఛాంపియన్‌లు శ్లోక, వెన్నికతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా అకాడమీ చెస్ క్రీడాకారులతో కలిసి ఒకేసారి చెస్‌ను ఆడారు. ఆకాడమీ గ్రాండ్ మాస్టర్ భరత్‌కుమార్‌రెడ్డి అభిజిత్ గుప్తాను ఓడించారు. మరోఇద్దరు క్రీడాకారులు తనీస్, సిబిఐన్స్టీన్ డ్రా చేసుకున్నారు. చెస్‌క్రీడాకారులకు పలు,సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సిఈఓ సందీప్‌నాయుడు, శీతల్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ కార్టింగ్ వాహనాలు ప్రారంభం



స్టీల్ కార్డింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త: గాంధీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకంలో భాగంగా సోమవారం హుస్సేన్‌సాగర్ తీరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 162 మంది లబ్ధిదారులకు మురుగు వ్యర్థాల రవాణా (స్టీల్ కార్టింగ్) వాహనాలను రాష్ట్ర మంత్రులు కెటిఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పంపిణి చేశారు. అలాగే అంబర్‌పేట నియోజకవర్గంలోని మరో 5గురికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ దళితుల దశ దిశ మార్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కెసిఆర్ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కెసిఆర్ ఈ దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. నేడు ప్రారంభించిన 162 వాహనాలు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి ఆధ్వర్యంలో నడుస్తాయని చెప్పారు. పరిశుభ్రతకు పెద్ద పిట వేసి ప్రజారోగ్యాన్ని కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం అందరికంటే ముందే ఉందన్నారు. కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ స్వచ్ఛా తెలంగాణ సాధించడంలో భాగంగా ప్రజలకు మరింత పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యాన్ని అందించేందుకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్పోరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం కెసిఆర్

**గ్రేటర్ మేయర్ విజయలక్ష్మీ, ఎంపి రంజిత్‌రెడ్డిలు**



నార్సింగి మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇంటి పట్టాను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు

నార్సింగి, అక్టోబర్ 2 ప్రభాతవార్త : నిరుపేదల సొంతింటి కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మీ, చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ పరిధిలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఆత్మ గౌరవంతో జీవించాలన్న ప్రధాన లక్షంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు పిచ్చుక గూళ్ల వలే ఇచ్చారని, బిఆర్ఎస్ సర్కారు డబుల్ బెడ్ రూం ఇళ్లను కట్టి ఇచ్చిందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మరిచి పోకుండా వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను పట్టించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సిహ్మా, కౌన్సిలర్లు శివారెడ్డి, అరుణజ్యోతి, పత్తి శ్రీకాంత్, సునీత గణేష్, విజిత ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

## నేత్రపర్వం చిన్నారుల కళాభినయాల సంస్కృతి కళావైభవం : ప్రముఖ నటుడు డా. సుమన్




చిన్నారి కళాకారులను సన్మానించి జ్ఞాపికలు అందిస్తున్న సుమన్, కళ్యాణశాస్త్రి, భార్గవి, శివశంకర్ తదితరులు

నాంపల్లి, అక్టోబరు 2 ప్రభాతవార్త : ప్రముఖ సంస్థలు సంస్కృతి కళాధార, శ్రీ చారుచంద్ర కూచిపూడి నాట్యనికేతన్ సంయుక్తంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో నిర్వహించిన సంస్కృతి కళావైభవం చిన్నారుల వివిధ కళాభినయాలతో నేత్రపర్వం కావించాయని ప్రముఖ నటుడు డా. సుమన్ తల్వార్ ప్రశంసించారు. పిల్లలకు చదువుతోపాటు కళలను నేర్పిస్తున్న చిన్నారి కళాకారుల తల్లిదండ్రులను, గొప్పకళాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్న గురువులను అభినందించారు. కళాసంస్థల నిర్వాహకులు డా. అర్విరాల కళ్యాణశాస్త్రి, భార్గవి, శివప్రసాద్‌ల నేతృత్వంలో ఎంతో చూడముచ్చటగా జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు వాద్య, సంగీత, నృత్య ప్రదర్శనలతో చక్కగా కొనసాగి విచ్చేసిన అసంఖ్యాక కళాప్రియులను ఆహా దపరిచి మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుమన్ గౌరవ అతిథులు బెనర్జీ, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులతో కలిసి నేటి సాంస్కృతిక కళావైభవంలో తమ ప్రదర్శనలతో అలరించాయి.

# సొంత ఇంటి కలను నిజం చేసిన ఏకైక సిఎం కెసిఆర్

**పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు : హోంమంత్రి మహమూద్‌అలీ**



లబ్దిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం క్రిష్ణారావు తదితరులు

దుండిగల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త: పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసిఆర్ అని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మూడవ విడత డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో భాగంగా దుండిగల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం క్రిష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజులతో కలిసి లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను నేరవేర్చేందుకు కేసిఆర్ ప్రభుత్వం డబుల్ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏప్రభుత్వాలు చేయని విధంగా ప్రైవేటు అపార్ట్‌మెంట్లకు ధీటుగా డబుల్ ఇండ్లను సకల సౌకర్యాలతో వాటిని నిర్మించి దశలవారీగా అర్హులైన పేదలకు లాటరీ ద్వారా ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నాం. నగరవ్యాప్తంగా ఇప్పటి వరకు 44,020 ఇండ్లను లబ్దిదారులకు అందజేయగా నేడు మరో 19,020 ఇండ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమీషనర్ మమతా, ఎన్‌ఎంసి మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, డిఎంసి చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణిక్రిష్ణ, వైస్‌చైర్మన్ పద్మారావు, కెఎంసి చైర్మన్ శ్రీశైలంయాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## బొటానికల్ గార్డెన్‌లో ఉత్సాహంగా రన్ ఫర్ పీస్ రైడ్




జెండాఊపి రైడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపి సంతోష్, ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, అక్టోబరు 2 ప్రభాతవార్త : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని కొత్తగూడ బొటానికల్ గార్డెన్ ఆవరణలో సోమవారం రన్ ఫర్ పీస్ రైడ్‌ను నిర్వహించారు. ఈ రన్‌లో ఔత్సాహికులు భారీ ఎత్తున పాల్గొని 2కె, 5కె, 10కె రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రైడ్‌ను రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు హాజరై ప్రారంభించారు. అంతకు ముందు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బొటానికల్ గార్డెన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీస్ రైడ్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో శారీరక వ్యాయామం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరికి శారీకర వ్యాయామాన్ని పరిచయం చేయడంతో పాటు అవగాహన కల్పించేందుకు ఇటువంటి రన్‌లు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైడ్‌లో వృద్దులు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, మాదాపూర్ డిసిపి సందీప్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్‌ముదిరాజ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు భరత్‌రెడ్డి, బాలక్రిష్ణ, ఎవి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం చేతుల మీదుగా పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే దానం

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 2, ప్రభాతవార్త : ఖైరతాబాద్‌కు చెందిన మూడవ విడత లబ్ధిదారులకు సోమవారం కొల్లూరులో నిర్మించిన 1643 డబల్ బెడ్ రూమ్ పట్టాలను సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. కొల్లూరులో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ పంపిణీ కార్య్రమంలో పట్టాలను అందుకోవడానికి ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులను నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో ఎమ్మెల్యే దానం నాగేందర్ సాగనంపారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు విడుతలలో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 2643 మంది లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ పట్టాలను అందజేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ డబల్ బెడ్ రూమ్‌లను అందజేస్తామని, ఇది నిరంత ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు, దానం నాగేందర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించాలి

**మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్స్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మేడి శంకర్**



దీక్షలో పాల్గొన్న తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్స్ ఐక్యవేదిక నాయకులు

ధర్నాచౌక్, అక్టోబర్ 2, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని మాజీ ప్రజా ప్రతినిధుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్స్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మేడి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్స్ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి మేడి శంకర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గ్రామాలకి ఎనలేని కృషి చేసి, గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, కౌన్సిలర్స్ న్యాయమైన డిమాండ్లపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. మాజీ ప్రజాప్రతినిధులు తమ పదవులు అయిపోగానే అనారోగ్యంతో, అప్పుల బాధతో ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, మాజీ ప్రజా ప్రతినిధులకు పింఛన్లు ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకుఉల చింతపల్లి పద్మ, బట్టే శంకర్, మహ్మద్ అబ్దుల్ రహీం, లిక్కి రామరాజు, మల్లిఖార్జున్‌గౌడ్, కొమ్ము పాండు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లో గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎన్‌సిసి బాలికలు

## డబుల్ బెడ్‌రూములు కేటాయింపులుపై విచారణ జరపాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేష్**



ధర్నాలో సిపిఐ నేతలు

అల్వాల్, అక్టోబరు 2 ప్రభాతవార్త: డబుల్ బెడ్‌రూము ఇళ్ళు కేటాయింపులో జరుతున్న అవకతవకలుపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం అల్వాల్ జెఎసి ప్రాంగణంలో నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. జిహెచ్ ఎంసి, రెవెన్యూ అధికారుల ఉదాసీనత, అవినీతి కారణంగా అనర్హులు చేతిక డబుల్ బెడ్‌రూములు వెళుతున్నాయని బాల మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతలు సిఫార్సు లను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారని అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. గృహలక్ష్మీ పథకం 3లక్షలు అనర్హులు జేబులోకి వెళుతోందని వివరించారు. అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు రొయ్యల కృష్ణమూర్తి, సహదేవ్, సల్మాన్ బేగ్, చంద్రయ్య, జంగయ్య, నరేంద్ర చారి, రవి చంద్రన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## కొంపల్లిలో కాంగ్రెస్ పెద్దఎత్తున ర్యాలీ



కొంపల్లి నుండి ర్యాలీగా బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కొంపల్లి, అక్టోబర్ 2 ప్రభాతవార్త: కాంగ్రెస్‌లో చేరికలతో కొంపల్లి మున్సిపాలిటీలో కొత్త ఉత్సాహం మొదలైందని అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలో చేరి నగరానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్‌తో కలిసి ఆయన జన సమూహంతో పెద్ద ఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదవాడికి న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. నేడు ప్రతి ఒక్కరు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఇప్పుడు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. మైనంపల్లి హన్మంతరావు పార్టీలోకి రావడంతో సంతోషకరంగా ఉందని వారు నగరానికి వస్తున్నందున్న శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున్న పార్టీ శ్రేణులతో కలిసి విమానశ్రాయనికి బయ లుదేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

## పాతబస్తీలో మహాత్మా గాంధీ జయంతి



**మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు కన్నయ్యలాల్,రాజేష్ కుమార్‌లు నివాళులు అర్పిస్తున్న దృశ్యం**

చార్మినార్,అక్టోబరు 2 ప్రభాతవార్త : పాతనగరంలో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఫతేదర్వాజలో ఉన్న జాతి పిత మహాత్మా గాంధీ విగ్రహానికి పాతబస్తీ బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్యలాల్ ఆధ్వర్యంలో టిపిసిసి ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ రాహుల్ (రాజేష్ కుమార్) కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,సయ్యద్ ఇక్బాల్,అబేద్ అలీ,యూనస్ దానిష్‌లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. .పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా ఫత్తే దర్వాజలోని గాంధీ విగ్రహానికి యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి ఎస్.పి.క్రాంతి కుమార్,నాయకులు ఆర్.శివ కుమార్,జి.నవీన్ కుమార్,జి.ప్రణిత్,స్థానికులు ఎ.కాళిదాస్,వి.నర్సింగ రావులు ఘనంగా నివాళులు అర్పించారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



**కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సమరెడ్డి సురేందర్‌రెడ్డి,బిజెవైఎం అధ్యక్షులు శివ చంద్రగిరి,బిజెపి నాయకులు**

యాకుత్‌పుర,అక్టోబరు 2 ప్రభాతవార్త : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ డివిజన్ల బిజెవైఎం ఆధ్వర్యంలో ఉప్పుగూడ జెండా నుంచి మంగళ్ ముఖి హనుమాన్ దేవాలయం వరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సమరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలిపారు.గౌలిపుర డివిజన్ కార్పొరేటర్ ఆలె.భాగ్యలక్ష్మీ,బిజెపి నాయకులు కౌడి మహేందర్,శ్రీనివాస్, చంద్రశేఖర్,పెండం లక్ష్మణ్,ధీరజ్,రఘు,మహేందర్, సతీష్, యువమోర్చ నాయకులు సుభాష్,జగన్,రాజేష్,భార్గవ్ చారి, ప్రదీప్,ఆనంద్,గోవర్ధన్,మహిళా మోర్చ నాయకులు రుక్మిణి, లక్ష్మీ బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శోభాయాత్రలో గాయపడ్డవారిని పరామర్శించిన బిజెపి శ్రేణులు



కూకట్‌పల్లి, అక్టోబర్ 2, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధి లోని ఫతేనగర్ డివిజన్‌లో గల దీన్ దయాల్ నగర్ బస్తీలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో జరిగిన గొడవలో గాయపడ్డ వారిని సోమవారం మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డితో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావులు బస్తీ వాసులను పరామర్శించారు.

## తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ బాడీ సమావేశం

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 2, ప్రభాతవార్త : తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వి.కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 6వ తారీకున సినిమా ఆటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ఫెడరేషన్, తెలుగు ఫెడరేషన్ చలన చిత్ర పరిశ్రమ సంయుక్తంగా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుటకు తీర్మానిం చడం జరిగిందన్నారు. ఈ జన్మదిన వేడుకలు యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉదయం 10:30గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున సినిమా కళాకారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ మీటింగ్‌లో ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ హెచ్.మూర్తి, ట్రెజరర్ వి.ఠాగూర్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రిథమిక్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్




**జిమ్నాస్టిక్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు**

హైదరాబాద్, అక్టోబరు 2,ప్రభాతవార్త: ఐఎస్ఎస్ఓ నేషనల్ గేమ్స్ 2023 పోటీలు ఉత్సాంగా సాగుతున్నాయి. నగరంలోని గాడియం స్కూలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ విభాగంలో హ్యూమన్ అథ్లెటిజం ,ఫ్లెక్సిబులిటీ, రిథమిక్, ఆర్టిస్టిక్ ఎక్స్‌ప్రెషన్‌లతో కూడిన అద్భుతమైన ప్రదర్శన జరిగింది. ఇందులో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు సర్టిఫికేట్లు, అవార్డులు అందజేశారు. రిథమిక్ జిమ్నాస్టిక్స్ అనేది బాలె, డాన్స్‌అనే రెడు అంశాలను మిళితం చేసి, మంత్ర ముగ్ధులను చేసే క్రీడ, ఇది అసాధారణమైన సామర్థ్యాలనే కాక అద్భుతమైన రిథమ్, గ్రేస్ రెండింటినీ ప్రదర్శిస్తుంది. మరోవైపు ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ అనేది బలం బ్యాలెన్స్ చురుకుదనాన్ని సమ్మిళితం చేసే విభాగం, ఇందులో బ్యాలెన్స్ భీమ్, ఆన్‌ఈవెన్‌బార్స్, వాల్ట్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ లాంటి వాటితో అథ్లెట్లు తమ అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపర్చారు. క్రీడాకారులు ఇంత అద్భుమైన ప్రదర్శనకు కారణంప్రముఖ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ జిమ్నాస్టిక్స్ ఎక్స్ పర్ట్ (ఎంఏజీ) భారతీయ జిమ్నాస్టిక్స్ జాతీయ జట్టుకు కోచ్ అయిన మనోజ్ రాణా ఒకరు. ఆయన దగాడియం స్కూల్‌లో జిమ్నాస్టిక్ మెంటర్‌గా చాలా కీలక పాత్ర పోషించారు.

## కార్యదక్షత, అంకితభావంతోనే సమాజంలో గుర్తింపు

**రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**



**ఐట్యాప్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**

బేగంపేట అక్టోబరు 2,ప్రభాత వార్త : కార్యదక్షత,అంకిత భావంతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. రాజారత్న హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు ఐడీఎల్ టీచింగ్ అవార్డు ప్రోగ్రాం (ఐట్యాప్) 2023 పురస్కారాలను అందజేసారు.రాజారత్న హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీకల్ యూనివర్శిటీ డైరక్టర్ డా.ఆర్.బి.అంకం అధ్యక్షతన బేగంపేట హోటల్ తాజ్ వివాంతాలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వకుళా భరణం కృష్ణ మోహన్ రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్దేశకులైన ఉపాధ్యాయులకు అవార్డులను ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నా రు. ఈ కార్యక్రమంలో సిరందాస్ శ్రీనివాసులు,ఆర్టీఐ మాజీ కమీషనర్ డా.మాడభూషి శ్రీధర్,బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్,రాములు, గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ డా.వెంకటరావు,డా.వెంకట సత్యనారాయణ, విల్సన్,నందకుమార్‌రెడ్డి,అక్షయ పాత్ర శ్రీనివాస్,రాధాకృష్ణ,వకుళ వ్యాస్,చేబ్రోలు శశిబాల తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ స్ఫూర్తితో చంద్రబాబుకి మద్దతుగా నిరాహార దీక్ష



**దీక్ష చేస్తున్న టీడీపీ నేతలు**

ధర్నాచౌక్, అక్టోబర్ 2, ప్రభాతవార్త: భారత స్వతంత్ర్యోద్యమంలో తన సత్యాగ్రహ దీక్ష ద్వారా తెల్లవారిని గడగడలాడించిన గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి గారికి మద్దతుగా నిరాహార దీక్ష చేపట్టటం జరిగిందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా రాజమండ్రి జైలులో చంద్రబాబునాయుడు చేపట్టిన దీక్షకు సంఘీభావంగా నారా భువనేశ్వరి చేపట్టిన దీక్షకు మద్దతుగా సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళా నాయకురాలు, తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన నిమ్మరసంతో దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్, నాయకులు బిల్డర్ ప్రవీణ్, శ్రీనివాస్‌నాయుడు, పరశురాం, బాలకృష్ణ, కట్టరాములు, ఆర్.భాస్కర్, వెంకటేష్‌చౌదరి, జి.యాదగిరిరావు, నాగు నగేష్, శశిరేఖ, భవాని శ్రీనివాస్, చంద్రమోహన్‌గౌడ్, మధుసూదన్, దానం బాలకృష్ణ, శ్రీదేవి, చంద్రకళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు రాజ్యాధికారం దిశగా సాగాలి: బీసీ సంఘాల ఐక్యవేదిక



**బీసీ జనజాగరణ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు**

శేరిలింగంపల్లి, అక్టోబర్2 ప్రభాతవార్త : రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని,జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు పాలించబడే వారుగానే ఉంటున్నారే గాని పాలకులుగా సత్తాచాటాలని తెలంగాణ బీసీ జనజాగరణ ఐక్య వేదిక నాయకులు అభిప్రాయపడ్డారు. చందానగర్‌లోని శ్రీ సుప్రజ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ బీసీ జన జాగరణఐక్యవేదిక చైర్మన్ భేరి రామచందర్‌యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రముఖులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు మారబోయిన రఘునాథ్‌యాదవ్,ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ నందకుమార్‌యాదవ్,మాజీ ఫ్లోర్ లీడర్ రామస్వామియాదవ్,ప్రభాకర్ యాదవ్, బోయిని మహేశ్,డాక్టర్ సత్యనారాయణ,ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు టి.నర్సింహులు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణ,యం.నారాయణరావు, ఆంజనే యులు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌కే సాయన్నముదిరాజ్,శమహిళా నాయకురాలు సరోజనమ్మ, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

## మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రామచంద్రనాయక్



నిజాంపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త: ములుగు జిల్లాలో గిరిజనుల వనదేవతలు సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రకటించడాన్ని హర్షిస్తూ ప్రగతినగర్‌లోని అల్లూరి సీతారామరాజు సర్కిల్ వద్ద భాజపా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ తాగుడుకు పెద్దపీట వేస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు ఆకుల సతీష్, నాయకులు సులోచన, శిల్పారెడ్డి, నాగరాజు, డా.ఎమ్ఆర్ఎస్.రాజు, సుమన్‌రావు, మదన్‌గౌడ్, వినోద్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, స్వామి, లఖన్‌రాయ్, అశోక్‌మైలారం, నరసింహులుయాదేశ్, బాలాజీనాయక్, పాండునాయక్, శ్రీనివాస్‌నాయక్, శంకర్‌నాయక్, ఉమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చేస్తున్న సేవలు ప్రశంసనీయం

**కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ**



**లబ్ధిదారులను అభినందిస్తున్న కార్పొరేటర్ జూపల్లి**

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 2, ప్రభాతవార్త : పేద ప్రజానీకానికి ముఖ్యమంత్రి కెసిఆర్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ మెట్రో ప్రొవిజన్ వద్ద డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చిన వారి కోసం బస్సు ఏర్పాటు చేశారు. వారందరికీ కూకట్‌పల్లి కార్పొరేటర్ సత్యనారాయణ అభినందనలు తెలిపి వారందరినీ బస్సులో తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మాజీ కార్పొరేటర్ నరేంద్ర ఆచార్య, సీఓ సుజాత, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నూనె రాజు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో బాపూజీకి ఘన నివాళులు



**రామకృష్ణనగర్ చౌరస్తాలోని బాపూజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్ గుప్తా, నాంపల్లి విజయ్‌గుప్తా, నాయకులు జూలూరు విజయ్‌గుప్తా, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా**

కుత్బుల్లాపూర్, అక్టోబరు 2 ప్రభాతవార్త : స్వాతంత్ర పోరాటంలో అహింస, శాంతి అనే ఆయుధాలతో విజయం సాధించిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అందరికీ ఆదర్శమని చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా అన్నారు. స్వర్గీయ మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ డివిజన్ రామకృష్ణనగర్‌లో గల బాపూజీ విగ్రహానికి చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నాంపల్లి విజయ్, కోశాధికారి బూర్గువెంకటేశం, సలహదారులు చింతల ఉమాశంకర్‌గుప్తా,పోల రమేశ్‌గుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కొంతం దీపిక



**సికింద్రాబాద్ కోర్టు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న కొంతం దీపిక**

అడ్డగుట్ట, అక్టోబర్ 2 ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే రోగాలను నివారించడంతో పాటు కాలనీ, ఇంటి పరిసరాలు సర్వాంగ సుందరంగా ఉంటాయని, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. ప్రధాని మోడి తలపెట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు పరిసర ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని తొలగించేందుకు చీపుర్లు పట్టి శ్రమదానం నిర్వహించారు. అదే విధంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోర్టు ఇరుపక్కల ఉన్న రహదారులో ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందు వల్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రముఖ న్యాయవాది జగన్ మోహన్ ముదిరాజ్ ఆమె దృష్టికి తెచ్చారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



**తార్నాకలోని మర్రికృష్ణారెడ్డి హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హింధీ ఉపాధ్యాయురాలు హెబ్సిబా గ్రేస్‌కు బుక్‌ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు**

## గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీలకు నివాళులు



**రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారిని అభినందిస్తున్న జూటూరు కీర్తిరెడ్డి**

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 2, ప్రభాతవార్త : జాతిపిత హాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీలకు వారి జయంతి సందర్భంగా బిజెపి సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని భాజపా కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని కీర్తిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

**బీజెవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..** మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ శ్రీనగర్ కాలనీలో బిజెవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు అవినాష్, మన్మధ, గణేష్, బోస్‌గౌడ్, శ్రీనివాస్, పవన్, విగ్నేష్, పార్టీ నాయకులు గంగరాజు, ప్రేమ్‌కుమార్; బంగారు ప్రశాంత్, లంకల దీపక్‌రెడ్డి, రాజేష్, చంద్రమోహన్, హరీష్‌యాదవ్, సునీత, శాంతికుమార్, నవీన్‌కుమార్, మల్లీగౌడ్, ఉమేష్, సుమన్ అగర్వాల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## 120 మందికి విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



**స్టార్ బుక్ రికార్డుతో నిర్వాహకులు, విద్యార్థులు**

తార్నాక, అక్టోబర్ 2 ప్రభాతవార్త: ఒకే వేదికపై 120 మంది విద్యార్థులు, పలువురు నిర్విరామంగా రెండు గంటల పాటు కీబోర్డు వాయిస్తూ పాటలు పాడి ఇంటర్నేషనల్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. యెషువా బెత్‌హలెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా కీబోర్డు వాయించుకుంటూ పాటలు పాడేవిదంగా శిక్షణ నిచ్చారు. వారి వద్ద శిక్షణ పొందిన వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చిన 120 మందిని సెలక్ట్ చేశారు. వీరందరి ప్రతిభను గుర్తించాలని కోరుతూ ఇంటర్నేషనల్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తార్నాకలోని మర్రిచెన్నారెడ్డి హాల్లో వీరందరికి కోబోర్డు వాంచుకుంటూ పాటలు పాడావేదింగా ఏర్పాటు చేశారు. దీంతో వారందరు సోమవారం రెండు గంటలపాటు కీబోర్డు వాయిస్తూ పాటలు పాడి తమ ప్రభతిభను కనబరిచారు. దీంతో ఇంటర్నేషనల్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డు ఫౌండర్ చైర్మన్ డా. జె అరవింద్ కుమార్, చీఫ్ ఎక్జిక్యూటీవ్ రాజేష్ కుమార్‌లు 120 మందికి రికార్డులో చోటు కల్పిస్తున్నట్లు ప్రకటించి వారికి ప్రసంశాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యెషువా బెత్ హలెల్ మినిస్ట్రీస్ ప్రిన్సిపాల్ కె.హెబ్సిబా గ్రేస్ వాలింటీర్లు ఎజ్రా శాస్త్రీ, స్నేహలత, షిలాహ్, నాన్సీ, చీర్లీ, కళ్యాణి, వరలక్ష్మి, శ్రీకాంత్ దేవ్, ప్రవీణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



**అమీర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 2, ప్రభాతవార్త : అభివృద్ధిలో సతన్ నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం అమీర్‌పేటలోని పలు ప్రాంతాల లో పర్యటించి 3.70కోట్ల రూపాయల విలువైన 10 అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా గురుద్వార్ సమీపంలోని సక్కువాడలో 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం హరిజన బస్తీలోని వివేకానంద కమ్యూనిటీ హాల్ సమీపంలో 16.80లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, బిజెఆర్ నగర్ 2లో 64 లక్షల రూపాయలతో వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద 15లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ ఏర్పాటు నిర్మాణ పనులు, రేణుక నగర్‌లోని గ్యాస్ గోదాం వద్ద 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని శ్రీరాంగనర్‌లో 45 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న స్ట్రాం వాటర్ లైన్ పనులు ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డిసి జగన్ పాల్గొన్నారు.

## సకలజనులకు రాజ్యాధికారమే'ప్రజాబంధు పార్టీ' లక్ష్యం

**పార్టీ అధ్యక్షులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్**




**డప్పుపై ప్రజాబంధు పార్టీని ప్రదర్శిస్తున్న రేపాల శ్రీనివాస్, గంగావరప్రసాద్, రామదాసు తదితరులు**

హైదరాబాద్, అక్టోబరు 2,ప్రభాతవార్త: అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ,ఎస్టీ, బిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రజాబంధు పార్టీ పనిచేస్తుందని ఆపార్టీ అధ్యక్షులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ అవిర్భావ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలను మేల్కొల్పే విధంగా ప్రజాబంధు పార్టీ అంటూ డప్పులపై పార్టీపేర్లు రాసి ప్రదర్శించారు. అనంతరం రేపాల మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్దించి 75ఏళ్లు గడిచినా అత్యధిక ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సగభాగమైన మహిళలకు సైతం తీరని అన్యాయం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బొమ్మశెట్టి గంగా వరప్రసాద్, జాయింట్ సెక్రటరీ నార్ల రామదాసు, ట్రేజరర్ వెంకటి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ సైదులు, వీరభద్రాచారి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## వంజరి కులస్థుల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి

**వంజరి సంఘం ప్రతినిధులు**



**సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు**

తార్నాక, అక్టోబర్ 2 ప్రభాతవార్త: వంజరి కులస్థుల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని వం జరి సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. తార్నాకలోని వంజరి భవన్‌లో సోమవారం తెలంగాణ వంజరి సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వార్షిక అకౌంట్స్ నివేదికను సమర్పించారు.వంజరి సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్నవివిధ కార్యక్రమాలను, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపూ విస్తృతంగా చర్చించారు. బీసీ బందును వంజరి సామాజిక వర్గానికి పర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధి కారి కాలేరు అమరేందర్, సంఘం ఛీఫ్ ప్యాట్రన్ సాల్వేరు ముత్తయ్య వంజరి,కార్య నిర్వాహక కార్యదర్శి కరిపె ప్రవీణ్, జగన్‌మోహన్ రావు,వంజరి సతీష్, లవంగు ఆంజనేయులు వంజరితో పాటు వివిధ జిల్లాల నుంచి పలువురు వంజరి కులస్థులు పాల్గొన్నారు.

### ఉపాధిలేక వివాహం జరగక తీవ్ర మనోవేదనతో యువకుడి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, అక్టోబరు 2 ప్రభాతవార్త : తల్లికి ఆనారోగ్యం వేధిస్తుండటంతో పాటు ఉపాధిలేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోలాశంకర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వనం సతీష్(35) స్థానికంగా చిన్నచిన్న పనులు చేసుకుని తల్లిని పోశించేవాడు. గతకొంతకాలంగా తల్లికిఆరోగ్యం బాగోలేకపోవడంతో చింతల్‌లోని వినాయకనగర్‌లో నివసించే తన సోదరుడు వనం లింగంవద్దకు వెళ్లింది. ఒంటరిగా వుండటంతో పాటు ఉద్యోగం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకుగురైన వనం సతీష్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


**IN THE COURT OF THE HON'BLE THIRD SENIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT SECUNDERABAD S.O.P.NO. 22 OF 2023**

Between:
Sri. Devineni Susheel Kumar Das & another ...Petitioners
AND
M/s. Acrysil India Ltd & Others ...Respondents

To
All Concerned

Whereas the Petitioners above named filed the above O.P. to grant succession Certificate in respect of estate of Late Devineni Chandra Shaker Rao, who died Intestate on 06-01-2004 and Late Devineni Mohan Das, who died Testate on 22-12-2022 suit against you and others. The case is posted to 04-11-2023 at 10-30 AM for your appearance either in person or through an advocate to reply.

Take notice that in default of your appearance on the said date, the case will be decided ex-parte in your absence.

By Order of the Court

D.Sudarshan Rao
Counsel For Plaintiff
Plot No.22,
H.No.3-16-360
Avanthi Colony
Balamrai, Secunderabad.



**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియ జేయునది ఏమనగా మా క్లైంట్లు **శ్రీ అక్షయ్ భగ్‌వాన్ జదే తండ్రి శ్రీ భగ్‌వాన్ భానుదాస్ జదే, శ్రీమతి జైసెట్టి పద్మ భర్త శ్రీ జైసెట్టి రాజ మనోహర్** సుంది, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, శేరిలింగంపల్లి సర్కిల్, GHMC, క్రింద శేరిలింగంపల్లి మండలం, కొండాపూర్ గ్రామం వద్ద ఉన్న సర్వే సం.లు: 196, 197(P), 198(P), 199(P)లోని ప్లాట్ సం.లు: 1 మరియు 2, పై నిర్మింపబడి 93 చ.గజాలు లేదా 77.74 చ.మీటర్ల విస్తీర్ణం భూమి యొక్క అవిభాజ్యవాటాతో సహా, ఒక కార్ పార్కింగ్ మరియు కామన్ ఏరియా కలిపి 2405 చ.అడుగుల యొక్క ప్లింత్ ఏరియాతో "మానస రెసిడెన్సీ"లో (GHMC No.1-55/12/M/4B, PTIN No. 1119917263) 4వ అంతస్తులో 4B సం. కలిగిన ప్లాట్ అది మొత్తం అంతా కొనుగోలుకు ఉద్దేశించినారు. మరియు విక్రయ పరిగణనకు అడ్వాన్స్‌గా భారీ మొత్తాన్ని చెల్లించి ఉన్నారు. ఎవరైనా వ్యక్తి/లు/బ్యాంక్‌లు/ఆర్థిక సంస్థలు పైన పేర్కొన్న సదరు ఆస్తికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, క్లెయ్, హక్కు టైటిల్, ఆసక్తి, ఏవిధమైన స్వభావం గల వివాదం అయినా అతడు/ఆమె/వారు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి ఏడు (7) రోజులలో అతని యొక్క/ఆమె యొక్క/వారి అభ్యంతరం క్లెయిమ్, హక్కు, టైటిల్, ఆసక్తి/వివాద వివరాలతో వాటిని నిరూపించగల డాక్యుమెంటరీ నిరూపణలతో దిగువ సంతకందారుని సంప్రదించవలెను. విఫలమైతే మా క్లైంట్ శ్రీ అక్షయ్ భగ్‌వాన్ జదే తండ్రి శ్రీ భగ్‌వాన్ భానుదాస్ జదే, ఎటువంటి అభ్యంతరాలు/ క్లెయిమ్‌లు/ ఎవరి యొక్క వివాద వివరాలు/వ్యక్తి/లు ఎవరి నుంచి ఏమీ లేవని నిర్ధారించి మరియు తర్వాతి క్లెయిమ్‌లు లేదా వివాదాలు ఏమీ పరిగణించడం జరగదని తెలియజేస్తున్నాను. మరియు మా క్లైంట్ యొక్క విక్రయ వ్యవహారాలు చెల్లుబాటైనవిగా మరియు చట్టసమ్మతమైనవిగా పరిగణింపబడతాయి.

సం/- A. ప్రసాదరావు , న్యాయవాది
ప్లాట్ నం.103, కృష్ణారెడ్డి విల్లా, బ్లాక్-B, ఇ.సం.1-11-271/D1/103B, గగన్‌విహార్ కాలనీ, భగవంతపురం, బేగంపేట, హైదరాబాద్.
ఇ-మెయిల్: advprasada.apkari@outlook.com
మొబైల్: 9582796964, 8106795964, 040-35941590

## జాతిపిత మహాత్ముడికి పలువురి నివాళులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి తదితరులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమలాసుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** గాంధీ జయంతి సందర్భంగా నాగోల్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి ఎల్బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంజులరెడ్డి, బుద్దా సత్యనారాయణ,లాలయ్యగౌడ్, రాణి, శైలజరెడ్డి, సరోజ పాల్గొన్నారు. **నాగోల్‌లో..** గాంధీ జయంతి సందర్భంగా నాగోల్ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజుల రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, మల్లారపు శ్రీనివాస్, రమేష్‌నాయక్, గుర్రం శ్యామ్‌చరణ్‌రెడ్డి పాల్గొన్నారు. **వికాస్‌నగర్‌లో...** గాంధీ జయంతి సందర్భంగా చైతన్యపురి డివిజన్ వికాస్ నగర్‌లోని గాంధీ విగ్రహానికి జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమలసుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శరత్‌చంద్ర, శోభరాణి, జ్యోతి, జయశ్రీ, పావని, సంగీత, అనిత, నరేందర్‌రెడ్డి, సంతోష్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**తుర్కయంజాల్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, కోశికె ఐలయ్య, నాయకులు కుంట గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏవీఆర్ బిల్డర్స్ యజమాని వెంకట్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కమ్మగూడ 19వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకట్‌రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు మల్‌రెడ్డి రంగారెడ్డి, కోసికె ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, మంగ్లానాయక్, గుడ్ల గణేష్, హన్మంత్‌గౌడ్, వేముల శంకర్, గుడ్ల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇల్లు ఇవ్వాలి : ఆర్.గోపాల్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** అర్హులైన నిరుపేదల అందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్ డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల పేర్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీవిగ్రహానికి అందజేశారు. మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాల్ మాట్లాడుతూ ప్రజల కనీసమౌలిక వసతి అయిన సొంతిల్లు నిర్మాణాలకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందించగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో మహమూద్ మహబూబ్, ఐ.పాపయ్య, జిల్లెల కృష్ణ, ఆర్.కరుణాచారి, మహ్మద్ పైమీదా, ఎస్.నర్సింహ్మా, ప్రసాద్, చంద్రశేఖర్, మహ్మద్ జాహీద్ పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిసిసి అధ్యక్షుడు చల్లా తదితరులు



మహాత్మునికి పుష్పాంజలి ఘటించిన మేయర్ పారిజాత తదితరులు



కార్మికులు, ఆశాలతో కలిసి నివాళులర్పిస్తున్న పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చంద చెరువు కట్టపై ఉన్న గాంధీ విగ్రహానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్ముడు సూచించిన బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామిడి గోపాల్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, ఆవల యాదయ్య, భూపాల్‌రెడ్డి, అరుణ, జ్యోతి, అరుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. **బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో..** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డిఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌చౌరస్తాలో ఏర్పాటుచేసిన గాంధీజయంతి కార్యక్రమానికి టిపిసిసి కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కందాడి శ్రీరాంరెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలునాయక్, అమృతానాయుడు, దీక్షిత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. **జిల్లెలగూడ సంద చెరువు కట్టపై...** గాంధీ జయంతి సందర్భంగా జిల్లెలగూడ సందచెరువు కట్టపైనున్న జాతిపిత విగ్రహానికి 17వ డివిజన్ కార్పొరేటర్ పోరెడ్డి పద్మభాస్కర్‌రెడ్డి పారిశుధ్య కార్మికులు, ఆశావర్కర్లతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, పలువురు మహిళలు పాల్గొన్నారు. **బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో...** గాంధీ జయంతి కార్యక్రమాన్ని బడంగ్‌పేట్‌లో కార్పొరేషన్ కార్యాలయంలో అధికారికంగా జరిపారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నేనావత్ బాలు నాయక్, బండారి మనోహర్, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్ బాబు తదితరులతో పాటు వివిధ విభాగాల సిబ్బంది జాతిపితకు ఘనంగా నివాళులర్పించారు.

## ఓటమి భయంతోనే చౌకబారు ప్రకటనలు

**వనస్థలిపురం, అక్టోబరు 2 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్‌నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి చౌకబార్ పట్టణంలో మానుకోవాలని టిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు పలికారు. వనస్థలిపురంలోని మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సామ తిరుమలరెడ్డి, భవాని ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ రిజిస్ట్రేషన్ సమస్యకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జీవో 118 తీసుకువచ్చి పరిష్కరిస్తే జీవో 118పై అవగాహన లేకుండా సామ రంగారెడ్డి విమర్శలు చేయడం అర్ధరహితమన్నారు. జీవో 118తో తమ స్థలాలకు యజమానులు అయ్యారని త్వరలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా ఇంటి పన్నులు తగ్గాయని గతంలో ఉన్న పనులకు ఇప్పటి పనులకు తేడా తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఏ ప్రభుత్వంలోనైనా కాంట్రాక్టర్లకు చేసే అభివృద్ధి పనుల్లో బకాయిలు ఉంటాయని అది తెలుసుకుని రంగారెడ్డి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే సుధీర్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు.

## ఘనంగా మహాత్ముడి జయంతి వేడుకలు

**హయత్‌నగర్, అక్టోబరు 2 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేటలో టీపీసీసీ కార్యదర్శి, ప్రచార కమిటీ సభ్యుడు దండెం రాంరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ పాల్గొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ రావినారాయణరెడ్డి కాలనీలో సర్వసేవాసంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి, సంఘం కన్వీనర్ సైదులు పాల్గొన్నారు. హయత్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ, సంఘం అధ్యక్షులు రమాదేవి పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి చేరిన శ్రీ సాయినగర్ గణనాథుడు..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద గణనాథుడికి కాలనీ అధ్యక్షులు మద్దెల వెంకన్న గౌడ్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లడ్డును వేలం పాట వేసారు. రూ. 61 వేలకు కంసనాబాద్ వెంకటేష్‌చారి లడ్డును దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేక అలంకరణతో కాలనీలో ఊరేగిస్తు కాప్రా చెరువులో నిమజ్జనం చేసారు. ఈ కార్యక్రమంలో రంపె చంద్రమౌళి, చెట్టప్ప, ఇస్తారి, జగదీష్ చారి, బుగ్గ ఉపేందర్, తాటి సుభాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. **గణపతికి ప్రత్యేక పూజలు...** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఫుల్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడిని సోమవారం మల్కాజిగిరి పార్లమెంటు బి.ఆర్.ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైఖేల్, ఆల్బర్ట్, శివ, శ్రీనివాస్‌రావు, రాజేష్, సాయి, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల సంరక్షణ బాధ్యత అందరిదీ

**హయత్‌నగర్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** భూగర్భ జలాల సంరక్షణపై ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని కేంద్రీయ భూగర్భ జలబోర్డు డివిజన్ -9 ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు జి.కృష్ణమూర్తి, సీనియర్ శాస్త్రవేత్త డా.ఎం.సుధీర్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని తట్టి అన్నారంలోని కేంద్రీయ భూగర్భ జలబోర్డు ఆధ్వర్యంలో తట్టిఅన్నారం గ్రామంలో కౌన్సిలర్లతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించి చెత్తచెదారాన్ని, ప్లాస్టిక్ బాటిళ్లనుతొలగించి డంప్‌యార్డుకు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి నిండిపోతోందని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని సూచించారు. నీటి వనరులను కాపాడుకోవాలని చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓబులేసు, కౌన్సిలర్లు పాశం అర్చనదామెదర్, దేవిడి గీతావేణు గోపాల్‌రెడ్డి, నాయకులు విజయసింహారెడ్డి, బోర్డు శాస్త్రవేత్తలు మాధవ్, పి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరికలు : ఎమ్మెల్యే మంచిరెడ్డి



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** అభివృద్ధికి ఆకర్షితులై తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రహ్మణపల్లికి చెందిన వివిధ కాలనీల వాసులు సుమారు 100 మంది ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొంద్రు మల్లేష్, నాయకులు కొంద్రు శ్రీనివాస్, మర్రి సంపతీశ్వర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, భిక్షపతి, అమరేం దర్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డికి గాంధీసేవ పురస్కార్ అవార్డు



నరేందర్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డికి గాంధీసేవ పురస్కార్-2023 అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా విద్యారంగానికి ఎనలేని కృషి చేస్తున్నందుకు గాను, సంచలనాత్మక ఫలితాలను సాధిస్తున్నందుకుగాను గాంధీ క్లబ్ ఇంటర్నేషనల్ 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మక గాంధీ సేవ పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

## మల్కాజిగిరిలో ఘనంగా గాంధీజీ జయంతి



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజ్‌గిరి, అక్టోబరు 2 ప్రభాతవార్త :** గాంధీ జయంతి సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని గౌతంనగర్, అల్వాల్, మల్కాజిగిరిలలో మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితా రెడ్డి, అనిల్, కిషోర్, రాముయాదవ్, మురుగేష, జగదీష్‌గౌడ్, బద్దం పరుశురాం, వెంకన్న, నిర్మలరెడ్డి, శోభన్, తదితరులు పాల్గొన్నారు. **గాంధీ పార్క్‌లో...** గాంధీజయంతి సందర్భంగా మల్కాజ్‌గిరి గాంధీ పార్క్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఎన్‌వి. సతీష్‌కుమార్, గుండా నిరంజన్, సత్యనారాయణ, సంపత్‌రావు, సంతోష్ రాందాస్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల పార్కింగ్‌కు ప్రభుత్వ స్థలం కేటాయింపు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, అక్టోబరు 2 ప్రభాతవార్త :** ఆటోనగర్‌లోని ఇసుక లారీల అడ్డా వద్ద రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందారెడ్డి ఆటోనగర్ ఇసుక లారీల పార్కింగ్ సమీక్ష సమావేశం 21 కాలనీల అధ్యక్షులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గారు హాజరై మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో ఇసుక లారీ అడ్డాను ఏర్పాటు చేసుకొని యజమానులు జీవనోపాధి గడించారు. నగరం అభివృద్ధి చెందడంతో చుట్టు పక్కల ఉన్న 21 కాలనీల ప్రజలు ఇసుక లారీల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే ఆటోనగర్ లోపల టిఎస్ఐఐసికి చెందిన 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామన్నారు. ఈ పార్కింగ్‌లో ఎటువంటి రుసుము చెల్లించకుండా లారీలను నిలుపుకోవచ్చని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఉచితంగా కేటాయించినందుకు లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నందారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ డీసీపీ, ట్రాఫిక్ డిసిపి, ఆర్టిఏ రఘునందన్‌గౌడ్, లారీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్‌రెడ్డి, సుర్వియాదయ్య, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్, అసోసియేషన్ నాయకులు, లారీ యజమానులు పాల్గొన్నారు.

## మహాత్ముడికి ఘన నివాళి.. : సిపి చౌహాన్



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉపేందర్‌రెడ్డి..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మల్కాజిగిరి, మౌలాలి, వినాయక్‌నగర్, నేరెడ్‌మెట్ డివిజన్ల పరిధిలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. మల్కాజిగిరి సర్కిల్ బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి నేరెడ్‌మెట్ గాంధీ పార్కులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, శ్రీనివాస్ రావు, మహేష్, రాజేష్, సాయి, సుమన్, శ్యామ్, మాధవరెడ్డి, దీన్‌దయాళ్, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించారు.

## ఉప్పల్‌లో ఘనంగా గాంధీజి జయంతి



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, ఆగిరెడ్డి తదితరులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 2 ప్రభాతవార్త :** జాతిపిత మహ్మాతగాంధీ జయంతి వేడుకలు ఉప్పల్ సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిసి శ్రీనివాస్, ఇంజనీర్ ఎల్.నాగేందర్‌ల ఆధ్వర్యంలో జరిగిన గాంధీజీ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీనేతలు పాల్గొని పూలమాలలువేసి నివాళులర్పించారు. రామంతాపూర్ గాంధీనగర్‌లో గాంధీజీ జయంతి వేడుకలకు కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ ప్రధాన రహదారిలో మహత్మగాంధీ విగ్రహానికి ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎం. పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా భారత యువజన సంఘం అధ్యక్షుడు బజారు అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, టిడిపి నేత కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, బజారు మురళీగౌడ్ పాల్గొని గాంధీజీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. **రామంతాపూర్‌లో..** రామంతాపూర్ గాంధీనగర్, చిలుకానగర్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, సంజయ్, నరసింహారెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



దీక్ష నిర్వహిస్తున్న గంగారం చిత్రంలో చెకొలేకర్, హరిగౌడ్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 2 ప్రభాతవార్త :** వికలాంగులు చట్టాన్ని అమలు చేయాలని ఎఫ్ఈడి సంస్థ అధ్యక్షుడు మద్దెల గంగారం డిమాండ్ చేశారు. సోమవారం మలక్‌పేట్‌లోని జాతీయ వికలాంగుల పార్కులో వికలాంగుల హక్కుల సాధన కోసం ఎఫ్ఈడి అధ్యక్షుడు గంగారాం ఆధ్వర్యంలో శాంతియుతంగా మౌన నిరాహారదీక్షను నిర్వహించారు.దీక్షకు మద్దతుగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెకొలేకర్ శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ లింగాల హరితో పాటు పలువురు దివ్యాంగనాయకులు దీక్ష శిబిరానికి విచ్చేసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల చట్టం తీసుకువచ్చి ఆరు సంవత్సరాల అయినప్పటికీ స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న వికలాంగుల పెన్షన్ వెంటనే మంజూరు చేయాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీని సులభతరం చేసి వికలాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎస్సీ ఎస్టీలతో సమానంగా నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల సంఘం నాయకులు చెరుకు నాగభూషణం, నల్గొండ శ్రీనివాస్, పద్మప్రియ, ఉషారాణి, వల్లభనేని ప్రసాద్, నరసింహ, ఆయేషా రూబిన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ రాజీనామా

**మల్కాజ్‌గిరి, అక్టోబరు 2 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ పంపారు. ఇటీవల భారాస నుంచి పార్టీలో చేరిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు మల్కాజిగిరి టికెట్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ చెప్పడంతో శ్రీధర్ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. టికెట్ తనకే వస్తుందని బీసీ నాయకుడు నందికంటి శ్రీధర్ భావించారు. ఈ క్రమంలో 1 రోజుల క్రితం ఢిల్లీకి పిలిపించుకొని శ్రీధర్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఇంతలోనే బీసీ వర్గానికి న్యాయం జరగదని కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు శ్రీధర్ వెల్లడించారు.

## బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలు

### మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలని డిమాండ్

### స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా: రాధాకృష్ణయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మండల్ రాధాకష్ణయాదవ్ తదితరులు

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో బీసీలంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలా భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గ బీసీ ఐక్యవేదిక నాయకులు మండల్ రాధాకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మల్కాజిగిరి చౌరస్తాగాంధీ పార్క్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే టికెట్ బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన 80%ఉన్న బీసీలను విస్మరించి అగ్రకులాలకు టికెట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమని, ఏ పార్టీలైనా బీసీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బహుజనులంతా ఒకటైతే ఏ పార్టీగెలవబోదని ఇప్పటికైనా రాజకీయ పార్టీలు బీసీల ప్రాధాన్యత గుర్తించి వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని పేర్కొన్నారు. గత 35 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మల్కాజిగిరి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## మహాత్ముని ఆశయాలు అమలు జరపాలి



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొత్త రామారావు బృందం.

**కుషాయిగూడ, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** గాంధీ జయంతిని పురస్కరించుకుని కాప్రా సర్కిల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి కాప్రా మాజీ కార్పొరేటర్ లయన్స్ ఆసుపత్రి చైర్మన్ కొత్త రామారావు, వెంకటసుబ్బయ్య తదితరులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సేవలు మరువలేని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఎన్. మూర్తి, కాసం మహిపాల్‌రెడ్డి, గగన్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, రవి, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు. **చర్లపల్లి డివిజన్‌లో...** గాంధీ జయంతిని పురస్కరించుకొని చర్లపల్లి డివిజన్ సోనియాగాంధీనగర్‌లో బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి రామ్మోహన్‌తో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాండాల శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలనరసింహ, వంశరాజ్, సాంబయ్యగౌడ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా గాంధీజీ జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ పన్నాల తదితరులు





జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి శేఖర్ తదితరులు

**నాచారం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** నాచారం బీఆర్ఎస్ కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీజీ చిత్రపటానికి కార్పొరేటర్ శాంతిశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యం రెడ్డి, వేముల మారయ్య, భూపాల్ రెడ్డి, దాసరి కర్ణ, అంజి కొరపాక, కట్టబుచ్చన్న గౌడ్, విఠల్ యాదవ్,తుంగతిరుపతి, ప్రీతి రెడ్డి, కావమేశ్వరీతో పాటు పలువురు పాల్గొన్నారు. **మల్లాపూర్ డివిజన్‌లో...** గాంధీ జయంతి సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఉప్పల్ మున్సిపల్ ఆఫీసులో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బేతి, ఇతర అధికారులు (ప్రభాతవార్త, ఉప్పల్)